## అధికారుల 'మామూళ్ల' బంధం..
# 'శ్రీ చైతన్య' దౌర్జన్యం

- అధికారులు సీజ్ చేయడం.. వీళ్లు ఓపెన్ చేయడం
- చైతన్య బరితెగింపు వెనుక కథేంటి..
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా..
- పరిగిలో రగిలిపోతున్న విద్యార్థి లోకం.
- అధికారులు స్పందిస్తారా.. కాపాడతారా.. చూడాలి.

**పరిగి, జులై 29 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** సీజ్ చేసినా వినరు.. ఆదేశాలను లెక్క చేయరు. పరిగిలో శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం బరితెగింపు!
జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాలు మాకేంటి? సీజింగ్‌లు మాకేంటి? అన్నట్లుగా వ్యవహరిస్తోంది వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం. విద్యాశాఖ అధికారులను, ప్రభుత్వ నిబంధనలను బొత్తిగా చిన్నచూపు చూస్తూ తమ వ్యాపారాన్ని మూసేశారు అనుకున్న ప్రతీసారి తిరిగి యధావిధిగా తెరుస్తూ అధికారులకే సవాల్ విసురుతోంది.

**- అనుమతులు నిల్.. వసూళ్లు ఫుల్..**
శ్రీ చైతన్య పాఠశాలలో 9, 10 తరగతులకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవు. అయినప్పటికీ చట్టవ్యతిరేకంగా, నిబంధనలకు విరుద్ధంగా ఈ తరగతులను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో మరియు తల్లిదండ్రుల కష్టార్జితంతో చెలగాటమాడుతున్నారు. అనుమతులు లేవన్న విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారులు ఇప్పటికే పలుమార్లు దాడులు చేసి, సదరు తరగతి గదులను సీజ్ చేశారు. అయితే అధికారుల సీజింగ్ ముద్రకు కనీస విలువ ఇవ్వని యాజమాన్యం, సీజ్ చేసిన సీల్‌ను సైతం తీసేసి, అవే




గదుల్లో మళ్లీ యధాతథంగా తరగతులు నిర్వహిస్తోంది. ప్రభుత్వ అధికారుల ఆదేశాలను ఇంత బహిరంగంగా తొక్కేస్తుంటే "వీరికి ఇంత ధైర్యం ఎక్కడిది?" అని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు.

**- జిల్లా అధికారులు తెలుసు.. యాజమాన్యం ధీమా వెనుక మర్మమేంటి..**
జిల్లా అధికారులకు అన్ని విధాలుగా చూసుకుంటున్నాం.. వారి ఆశీస్సులు, ఆదేశాల మేరకే మేము పాఠశాల నడుపుతున్నాం" అంటూ పాఠశాల యాజమాన్యం పరోక్షంగా చెబుతుండడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. అధికారులు ఒకవైపు సీజ్ చేస్తున్నామని చెబుతుంటే, మరోవైపు యాజమాన్యం యధావిధిగా స్కూల్ నడుపుతుండడం వెనుక పెద్ద ఎత్తున 'చేతులు మారాయా?' అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధికారాన్ని శ్రీ చైతన్య యాజమాన్యం ఏమాత్రం గమనించకపోవడం అధికారుల పనితీరుపైనే మచ్చ తెచ్చేలా ఉంది.

**- మండిపడుతున్న విద్యార్థి, ప్రజా సంఘాలు..**
ఈ వ్యవహారంపై పరిగి పరిధిలోని పలు విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ , ఏఐఎస్ఎఫ్, పిడిఎస్ యూ, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. శ్రీ చైతన్య పాఠశాల తీరుపై, విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న వైనంపై వారు మండిపడ్డారు. అధికారులు సీజ్ చేసిన గదులను మళ్లీ తెరిచి తరగతులు నిర్వహించడం అంటే చట్టాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని శ్రీ చైతన్య యాజమాన్యం ఎంత చిన్నచూపు చూస్తోందో అర్థమవుతోంది. అధికారుల సీల్‌కే విలువ లేకపోతే ఇక సాధారణ ప్రజలకు న్యాయం ఎక్కడ జరుగుతుంది? తక్షణమే ఈ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి. బాధ్యులైన యాజమాన్యంపై మరియు వారికి సహకరిస్తున్న అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

**- విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తారా..**
అనుమతి లేని తరగతులలో విద్యార్థులను చేర్చుకుని వారి భవిష్యత్తును నాశనం చేయడానికి వీల్లేదు. విద్యాశాఖ అధికారులు కేవలం పేరుకే సీజ్ చేసి చేతులు దులుపుకోవడం కాకుండా, శ్రీ చైతన్య బూటకపు వ్యవహారాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో పరిగి విద్యాశాఖ కార్యాలయం ముట్టడితో పాటు వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతమని హెచ్చరించారు.

**- అధికారులు స్పందిస్తారా.. కాపాడతారా..**
ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, అధికారుల ఆదేశాలనే హేళన చేస్తూ నడుస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై ఉన్నతాధికారులు ఇకనైనా కఠినంగా వ్యవహరిస్తారో లేక ఎప్పటిలాగే చూసీచూడనట్లు వదిలేస్తారో వేచి చూడాల్సి ఉంది.

## అక్రమ ఎరువుల దందాపై
# వ్యవసాయ శాఖ ఉక్కుపాదం..

- లైసెన్స్ లేకుండా డీఏపీ అమ్మకాలు..
- చిగురాల్‌పల్లిలో విజిలెన్స్ దాడులు,
- విక్రయదారుడుపై కేసు నమోదు

**పరిగి, జూలై 29 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, లాభార్జనే ధ్యేయంగా సాగుతున్న అక్రమ ఎరువుల దందాపై వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఎటువంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా అనధికారికంగా ఎరువులు విక్రయిస్తున్న ముఠాల గుట్టు రట్టు చేస్తూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పరిగి మండలం చిగురాల్‌పల్లి గ్రామంలో అనధికారికంగా, చట్టవిరుద్ధంగా డీఏపీ ఎరువుల విక్రయాలు సాగుతున్నాయన్న నమ్మదగిన సమాచారంతో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ బృందం తక్షణమే రంగంలోకి దిగింది. తనిఖీలు చేపట్టగా ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. పరిగి మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అజీమ్ అనే వ్యక్తి ఎలాంటి లైసెన్స్ లేకుండా,





అక్రమంగా ఎరువుల విక్రయాలు జరుపుతున్నట్లు అధికారులు ప్రత్యక్షంగా నిరూపించారు. గ్రామానికి చెందిన ఎం.డి. తాజుద్దీన్, పసుల బండయ్య అనే ఇద్దరు రైతులు ఈ నిందితుడి వద్ద నుంచే డీఏపీ ఎరువులు కొనుగోలు చేసినట్లు అధికారులు పక్కా ఆధారాలతో గుర్తించారు. అధికారులు సంఘటనా స్థలంలో అక్రమంగా నిల్వ ఉంచిన ?30 సీల్ చేయబడిన డీఏపీ మూటలు 20:20:0:13 లేబుల్ కలిగిన కాంప్లెక్స్ ఎరువుల మూటలు, స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. ?రైతులను మోసం చేస్తూ, అక్రమ మార్గంలో ఎరువులు విక్రయిస్తున్న నిందితుడు అజీమ్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడానికి పరిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి బి. కవిత మాట్లాడుతూ.. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను, లైసెన్స్ లేని వ్యక్తులను నమ్మి మోసపోవద్దు. ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా గుర్తింపు పొందిన, అధికారిక డీలర్ల వద్ద మాత్రమే సరైన బిల్లులు, రశీదులు తీసుకుని కొనుగోలు చేయాలి. విత్తనాలు, ఎరువుల విషయంలో అక్రమాలకు పాల్పడే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదు. చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం, అని ఘాటుగా హెచ్చరించారు. ?అనధికారికంగా ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో పరిగి వ్యవసాయ సహాయ సంచాలకులు కె. అరుణ, ఏడీఏ (టెక్నికల్) సందీప్, పరిగి మండల వ్యవసాయ అధికారి బి. రజిత, తదితరులు పాల్గొన్నారు.

## కరువును తట్టుకునే
# పంటలతోనే మేలు..

- నీటి పొదుపు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయలి..
- ఎల్‌నినో అత్యవసర పంట ప్రణాళికపై అవగాహన సదస్సు

**దోమ, జూలై 29 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో దోమ మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్. ప్రభాకర్ అధ్యక్షతన దోమ రైతు వేదికలో ఎల్‌నినో అత్యవసర పంట ప్రణాళికపై అవగాహన కార్యక్రమం, విత్తన మేళా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు వీక్షించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థి తులను దృష్టిలో ఉంచుకొని రైతులు అత్యవసర పంట ప్రణాళికను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, శాస్త్రవేత్తల సూచనలు పాటించడం ద్వారా కరువు ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం పంట సంరక్షణ శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ టి. రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో కంది, రాగి, మిను ములు వంటి కరువును తట్టుకునే పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. నేలలో తేమను సంరక్షించే చర్యలు, మల్చింగ్, అంతర పంటల సాగు, నానో యూరియా, నానో డిఏపి వినియోగం, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. గ్రామ



స్థాయిలో ప్రతి రైతు నీటిని పొదుపుగా వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని కోరారు.
వ్యవసాయ శాఖ సూచించిన అత్యవసర పంట ప్రణాళికను అమలు చేసి పంట నష్టాలను తగ్గించుకోవాలని తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపి, నీటిని పొదుపుగా వాడాలని కోరారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సమతుల్య ఎరువుల యాజమాన్యం, చీడపీడలు, తెగుళ్ల సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. కూరగాయల సాగు, ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్, మల్చింగ్ ద్వారా నీటిని పొదుపు చేయాలని కోరారు.?ఈ సందర్భంగా నిర్వహించిన విత్తన మేళాలో కంది, రాగి, మినుములు తదితర అత్యవసర పంటల నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమం ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే శాస్త్రీయ వ్యవసాయ విధానాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ?దోమ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు మాలి శివకుమార్ రెడ్డి, ?పర్గి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పి. ప్రభాకర్ రెడ్డి,?ఉద్యానవన శాఖ అధికారి రాం రెడ్డి,దోమ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ జకారి వెంకటయ్య, ?మండల వ్యవసాయ అధికారి ఆర్. ప్రభాకర్ రావు,వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్. శ్రవణ్, హారిక, హిమావతి, విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారులు, ఆత్మ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, దోమ మండలానికి ?
చెందిన పెద్ద సంఖ్యలో రైతులు,
తదితరులు, పాల్గొన్నారు.

## మంచినీటి పైప్‌లైన్ కు మరమ్మతులు..



- ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రాధాన్యత
- కౌన్సిలర్ సమీనా మీర్ తాహేర్ అలీ

**పరిగి, జూలై 29 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** ప్రజా సమస్యల పరిష్కారమే నా మొదటి ప్రాధాన్యత.. ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుకు వస్తున్న.. కౌన్సిలర్ సమీనా మీర్ తాహేర్ అలీ, మంగళవారం వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని 13వ వార్డు మందుల కాలనీలో మంచినీటి పైప్ లైన్, లీకేజ్ అవ్వడంతో కాలనీవాసులు కౌన్సిలర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బందితో కలిసి గంటల వ్యవధిలోనే పైపులైనుకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించినందుకు కౌన్సిలర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు, ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. మన వార్డు ప్రజల సంక్షేమం, సౌకర్యాలే నాకు ముఖ్యం. మందుల కాలనీలో వాటర్ పైప్‌లైన్ దెబ్బతిని నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని స్థానికులు నా దృష్టికి తీసుకురాగానే వెంటనే స్పందించాం. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మున్సిపల్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని, పనులను దగ్గరుండి త్వరితగతిన పూర్తి చేయించాను. కాలనీలో ఇకపై ఎలాంటి నీటి సమస్య లేకుండా చూసుకుంటాం. భవిష్యత్తులో కూడా వార్డులో ఏ చిన్న సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకురావచ్చు, తక్షణమే పరిష్కరించ డానికి నేను ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటారని ప్రజలకు భరోసానిచ్చారు.

## లాల్ సింగ్ తండాలో ముగిసిన ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ




- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి..
- గ్రామ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్

**కుల్కచర్ల, జూలై 29 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** ఓటు హక్కు పవిత్రమైనది... ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లాల్ సింగ్ తండా గ్రామ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ?వికారాబాద్ జిల్లా, కుల్కచర్ల మండల పరిధిలోని లాల్ సింగ్ తండా గ్రామపంచాయతీలో 'ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ ముగింపు సందర్భంగా ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ విజయవంతం గా పూర్తయిందని ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ప్రతి పౌరుడి పవిత్రమైన బాధ్యత. మన భవిష్యత్తును, గ్రామాభివృద్ధిని నిర్ణయించే అర్హత గల నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటే ఒక శక్తివంతమైన ఆయుధం. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతా యుతంగా వినియోగించుకోవాలి. మన తం డాలో గ్రామస్థులు, అధికారుల సహకా రంతో ఎస్.ఐ.ఆర్ నమోదు ప్రక్రియ నేటితో విజయ వంతంగా పూర్తయింది. ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓ దేవ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి వరుణ్ కుమార్, బి.ఎల్.ఎ గోపాల్ నాయక్, వార్డు సభ్యురాలు చంప్లి బాయి, నాయకులు ఉమ్లా నాయక్, గోపాల్ నాయక్, పెంట్యా నాయక్, చత్రియ నాయక్, రాజు నాయక్, రాం చందర్ నాయక్ తండావాసులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తా - వెంకటేష్ మాదిగ



- ఎమ్మార్పీఎస్ ఇన్చార్జిగా బొంపల్లి వెంకటేష్ మాదిగ నియామకం

**దోమ, జులై 29 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** ఎమ్మార్పీఎస్ సంస్థాగత బలోపేతం చేసేందుకు నూతన కమిటీల ఏర్పాటులో భాగంగా దోమ మండల ఎమ్మార్పీఎస్ ఇన్చార్జిగా బొంపల్లి వెంకటేష్ మాదిగ నియమి తులయ్యారు. ఈ మేరకు మంగళవారం సంఘం ముఖ్యా నాయకులు ఆయనను బాధ్యతల్లోకి తీసుకుంటూ అధికారిక ప్రకటన చేశారు. ?ఈ సందర్భంగా మండల ఇన్చార్జి బొంపల్లి వెంకటేష్ మాదిగ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులకు, పెద్దలకు నా హృద యపూర్వక ధన్యవాదాలు. మండల స్థాయిలో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి, నిరుపేదల హక్కుల సాధనకు అనునిత్యం శ్రమిస్తాను. ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడూ పేద ప్రజలకు, బాధితులకు అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలుస్తుంది. ?అలాగే త్వరలోనే దోమ మండలంలో నూతన కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేస్తామని, త్వరలో మండల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటిస్తామని తెలిపారు. నూతన కమిటీలు అమల్లోకి వచ్చే వరకు తాను తాత్కాలిక ఇన్చార్జిగా మండలంలో బాధ్యతలను నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు.

